# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ శాసనసభను మరింత మెరుగ్గా నిర్వహించడానికి కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశాలు ఉపయోగపడతాయని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.
- ❖ వైద్య విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఈ రోజు ఘనంగా జరిగింది.
- ❖ నైరుతి బంగాళాఖాతం, తమిళనాడు తీర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

========================

ఆంధ్రప్రదేశ్ శాసనసభను మరింత మెరుగ్గా నిర్వహించడానికి కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశాలు ఉపయోగపడతాయని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. బార్బడోస్‌లోని బ్రిడ్జ్ టౌన్ వేదికగా ఈ రోజు నుంచి 10వ తేదీ వరకూ జరిగే 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశాలలో ఆయన పాల్గొన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ CPCలో ఆంధ్రప్రదేశ్ తరఫున ఆయన ప్రాతినిధ్యం వహిస్తారు. ఆయనతో పాటు రాష్ట్ర శాసనసభ ప్రధాన కార్యదర్శి సూర్యదేవర ప్రసన్న కుమార్ కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ... కామన్వెల్త్ దేశాలలోని శాసనసభాపతుల అనుభవాలను పంచుకోవడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి ఈ సమావేశాలు ఒక వేదికగా నిలుస్తాయని అన్నారు. ప్రస్తుతం చట్టసభలు ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి CPC ఒక ప్రపంచ వేదికను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

========================

వైద్య విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విశాఖపట్టణంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆరోగ్య

ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేయాలని యువతకు ఆయన పిలుపునిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం విజయనగరంలో వెలసిన శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం ఈ రోజు ఘనంగా నిర్వహించారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటుగా పొరుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఆలయం నుంచి కోట గుమ్మం దాకా మూడు సార్లు సిరిమాను రథం ప్రదక్షిణం చేసింది. భక్తులు అంతా రథానికి దండం పెడుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు తన కుటుంబ సభ్యులతో వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం లోక్ సభ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయమూర్తి బబిత దర్శించుకున్నారు.

========================

విజయనగరంలోని శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ఈ నెల 9న ప్రారంభిస్తామని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ఈ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఈ రోజు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... అమ్మవారి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పుగా అమ్మవారు ఆరాధింపబడుతున్నారని ఆయన తెలిపారు.

========================

వాల్మీకి జయంతి సందర్భంగా ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నివాళి అర్పించారు. ఆదికవిగా వాల్మీకి రామాయణాన్ని జాతికి అందించారని గుర్తు చేశారు. జ్ఞాన సముపార్జనకు పరిమితి లేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి అని ముఖ్యమంత్రి కొనియాడారు. వివిధ జిల్లాల్లో కూడా వాల్మీకి జయంతిని ఈరోజు పాటించారు.

విరామం

========================

సహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వడంతో పాటు వారికి అండగా నిలవాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు సహకార సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లకుండా సహకార సంఘాలు రైతులకు అండగా నిలవాలన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందించడంతో పాటు అన్ని రకాలుగా రైతులకు సహకరించాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం కోసమే ప్రభుత్వం సహకార వ్యవస్థను ఏర్పాటు చేసిందని భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

========================

న్యూ ఢిల్లీలో భారీగా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ లో 10 కోట్ల రూపాయలు విలువ చేసే 10 టన్నుల 'ఏ–గ్రేడ్' ఎర్రచందనం

దుంగలను ఈ సందర్భంగా పట్టుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో న్యూఢిల్లీలోని తుగ్లకాబాద్ లో గల గోదాముపై రాష్ట్ర పోలీసులు దాడులు నిర్వహించారని చెప్పారు. హైదరాబాద్, ముంబైకి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు ఈ కేసులో అరెస్ట్ కాగా పరారీలో మరో నిందితుడు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎర్రచందనం దుంగలను తిరుపతి నుండి ఢిల్లీకి అక్రమంగా తరలించినట్లు అందిన సమాచారం ఆధారంగా రాష్ట్ర పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారని వివరించారు.

========================

విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. ప్రభాకరరెడ్డి ఆకాంక్షించారు. అనారోగ్యానికి గురై చికిత్స పొంది పార్వతీపురం జిల్లా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 16 మంది విద్యార్థులతో ఆయన ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గురుకుల పాఠశాలకు అవసరమైన ఆర్.ఓ. ప్లాంట్ సిద్ధమైందని, కొత్త మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంకా ఇతర సదుపాయాలు, మౌలిక వసతులు అవసరమైనవి కల్పిస్తామని తెలిపారు.

========================

ప్రజా ప్రతినిధులకు సంబంధించిన క్రిమినల్ కేసులను రెండేళ్ళ నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించాలని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు కోరారు. ఈ మేరకు న్యాయ వ్యవస్థ కీలక నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... ప్రజా ప్రతినిధుల మీద ఉన్న క్రిమినల్ కేసుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేశంలో కోర్టుల సంఖ్య కూడా తక్కువగా ఉందని ఇటీవల ఒక నివేదిక వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి కోర్టుల సంఖ్యను పెంచడంతో పాటు అవసరానికి తగినట్లుగా న్యాయమూర్తుల నియామకాన్ని కూడా చేపట్టాలని వెంకయ్యనాయుడు సూచించారు.

========================

నైరుతి బంగాళాఖాతం, తమిళనాడు తీరప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉన్నదని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. ఆ వివరాలను ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలలో స్వచ్ఛ సేవక్ దళాల ఏర్పాటుకు కృషి చేయనున్నామని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఈ రోజు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వచ్ఛాంధ్రతోనే అభివృద్ధి అని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రజలు వినియోగించకుండా జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

========================

లైసెన్సు లేకుండా ఏ విధమైన టపాసులు తయారు చేసినా, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. భీమవరంలో దీపావళి టపాసులు తయారీ, అమ్మకాలకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా వివిధ శాఖల అధికారులతో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో దీపావళి టపాసులు తయారీ, అమ్మకాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిబంధనల మేరకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

========================

========================